క్లుప్తంగా

పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డ్స్‌కు పెండింగ్‌లో ఉన్న 5 నెలల వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, ఆప్కాస్ రాష్ట్ర కార్యదర్శి పి వెంకటసుబ్బయ్య, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రవి, పవన్ ఒక సంయుక్త ప్రకటనలో జిల్లా అధికారులను డిమాండ్ చేశారు. ఐదు నెలలుగా వేతనాలు రాక వారు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సెక్యూరిటీ గార్డ్స్ కు కొత్త అగ్రిమెంట్ ప్రకారం రూ. 18,600 ఇవ్వాల్సి ఉండగా వీరికి కేవలం రూ. 7 వేలు నుంచి రూ.8 వేలు మధ్యలో మాత్రమే ఇస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వసతులు కల్పించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : నగరంలో మెరుగైన వసతులు కల్పించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రెటరి సయ్యద్ గౌస్‌పీర్ పేర్కొన్నారు. శనివారం 'ఇంటింటికీ కాంగ్రెస్ – ప్రజల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్' కార్యక్రమాన్ని నగరంలోని 27వ డివిజన్‌కు సంబంధించిన గౌస్ నగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షం పడితే దాదాపు మోకాళ్ళ వరకు కాలువ నీళ్లు రోడ్లపై నిలిచిపోతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. మెరుగైన వసతులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైస్ ప్రెసిడెంట్ సిరాజుద్దీన్, 27వ డివిజన్ ఇంచార్జ్ సయ్యద్ షామీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పుస్తకావిష్కరణ

కడప సెవెన్‌రోడ్స్ : కొత్తపల్లి రామాంజనేయులు రచించిన 'ఉదయ సింధూరం' అనే ఆధ్యాత్మిక, చారిత్రక, సాహిత్య, సంస్కృతీ వ్యాస సంపుటిని ఆదివారం హౌసింగ్‌బోర్డు కాలనీలోని శ్రీ కోదండ రామాలయంలో ఉదయం 10.00 గంటలకు ఆవిష్కరించనున్నట్లు రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్ధన్‌రాజు ఒక ప్రకటనలో తెలిపారు. రాయలసీమ టూరిజం, ఇంటాక్, పోతుల చిన్న ఓబుల్‌రెడ్డి, కంచమ్మ, సరస్వతమ్మ మెమోరియల్ ట్రస్టు సంయుక్తాధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తారన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లాలో ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించకుండా ప్రజల ప్రాణాలతో చలగాటమాడుతున్న హోటల్స్, బేకరీలు, స్ట్రీట్ ఫుడ్ సెంటర్ల ను తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆహార భద్రతా నియమాలను జిల్లాలోని కొన్ని హోటల్స్, బేకరి యాజమాన్యాలు పాటించడం లేదన్నారు. నిబంధనలు పాటించకుండా నడుస్తున్న హోటల్స్, బేకరిల యాజమాన్యాల పై ఫుడ్ సేఫ్టీ అధికారులు రెగ్యులర్‌గా తనిఖీలు నిర్వహించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఈ సమావేశంలో నగర కార్యదర్శి విజయ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ రమాదేవి

కడప కోటిరెడ్డిసర్కిల్ : అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యల్లో తన పరిధిలోని వాటిని పరిష్కరించేందుకు అన్ని చర్యలు చేపడతామని ఐసీడీఎస్ పీడీ రమాదేవి తెలిపారు. శనివారం పీడీ అంగన్వాడీ యూనియన్ ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు అంగన్వాడీ కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. ఈ విషయంగా తమ సంపూర్ణ తోడ్పాటు అందిస్తామని తెలియజేశారు. ఇదే క్రమంలో ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకు వస్తే పరిష్కరించడానికి చర్యలు చేపడతామని తెలిపారు. అనంతరం పలువురు యూనియన్ నాయకులు లేవనెత్తిన అంశాలపై పీడీ దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులతోపాటు పలువురు అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాత పెన్షన్లను తొలగించడం దారుణం

వల్లూరు(చెన్నూరు) : కూటమి ప్రభుత్వ 14 నెలల కాలంలో రాష్ట్రంలో దాదాపు నాలుగున్నర లక్షల పెన్షన్లు తొలగించారని, 15 సంవత్సరాల నుండి పెన్షన్ తీసుకుంటున్న వారిని కూడా తొలగించడం దారుణమని వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర పంచాయతీ రాజ్ విభాగం ప్రధాన కార్యదర్శి చీర్ల సురేష్ యాదవ్ అన్నారు. చెన్నూరులో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడితే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు 50 సంవత్సరాల వయసుకే పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చాక ఆ హామీని గాలికి వదిలేశారన్నారు. కూటమి పాలనలో కొత్త పెన్షన్ల మాట దేవుడెరుగు ఉన్న పెన్షన్లు ఊడగొట్టడం జరిగిందని ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. సెప్టెంబర్ 1వ తేదీ నాటికి అర్హులైన వారికి పెన్షన్లు అందేటట్లు చూడాలని ఆయన డిమాండ్ చేశారు. ఒక్క చెన్నూరు మండలంలోనే 120 మంది దివ్యాంగుల పెన్షన్లు తొలగించారన్నారు.

ముగిసిన శ్రావణ మాసోత్సవాలు


మారుతినగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో విశేష అలంకారం


పాలకొండల్లో అమ్మవారికి ప్రత్యేక అలంకారం


శ్రీ పాలకొండ్రాయస్వామికి శ్రావణమాస అలంకారం


చిన్నచౌకు నెహ్రూనగర్‌లోని పంచముఖ ఆంజనేయస్వామికి పుష్పాలంకరణ

కడప సెవెన్‌రోడ్స్ : పవిత్ర శ్రావణ మాసోత్సవాలు ముగిశాయి. చివరి శనివారం కడప నగరంలోని పలు వైష్ణవాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. నగర సమీపంలోని శ్రీ పాలకొండ్రాయస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు విశేష అలంకారం చేశారు. సుగంధ పరిమళాలు వెదజల్లే వివిధ రకాల పుష్పాలతో కూర్చిన మాలలతో అలంకరించారు. చివరివారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మారుతినగర్‌లోని ఆలయంలో ఆంజనేయస్వామికి ఆకుపూజ నిర్వహించారు. వివిధ పుష్పమాలలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. చిన్నచౌకు నెహ్రూనగర్‌లోని పంచముఖ ఆంజనేయస్వామి మూలమూర్తికి విశేష అలంకారం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యకరమైన సమాజం


స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న డీఎంహెచ్ఓ సిబ్బంది

కడప రూరల్ : పరిశుభ్రతను పాటించడం ద్వారానే ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజ తెలిపారు. శనివారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో స్వర్ణ ఆంధ్ర..స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రతకు చర్యలు చేపట్టారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధుల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై వివరించారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించడం ద్వారానే ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుందని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఉమామహేశ్వర కుమార్, రవిబాబు, శశిభూషణ్‌రెడ్డి, భారతి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ పింఛన్లు తొలగించేందుకు కుట్ర

కడప కార్పొరేషన్ : దివ్యాంగుల పింఛన్లు తొలగించేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర పన్నిందని వైఎస్ఆర్‌సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షులు అహ్మద్ బాషా (సాజాన్)ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు యాభై ఏళ్లకే పింఛన్ ఇస్తామని చెప్పిన ప్రభుత్వం, ప్రస్తుతం ఇస్తున్న పింఛన్లను తొలగించేందుకు శ్రీకారం చుట్టిందన్నారు. కూటమి వచ్చీ, రాగానే కొత్త పంథాకు తెరదీసి, రీవేరిఫికేషన్, రీ అసెస్ మెంట్ పేరిట వికలాంగులంతా మరోసారి వైద్యుల వద్దకు వెళ్లి సదరం సర్టిఫికెట్ చేయించు కోవాలని షరతు పెట్టిందన్నారు. వికలాంగత్వం ఎంత ఉందో వైద్యులతో ధ్రువీకరించి పర్సంటేజీతో సర్టిఫికెట్‌ను తీసుకు రావాలని కొత్త నిబంధనలను ప్రవేశ పెట్టిందన్నారు. దీంతో గత పది,పేదిహేనేళ్లుగా పింఛను తీసుకుంటున్న వికలాంగులు సైతం మళ్లీ సదరం సర్టిఫికెట్లు కోసం దరఖాస్తు చేసుకుని, వైద్య పరీక్షలు చేయించు కున్నారన్నారు. ఇప్పుడు వైకల్యం శాతం 40 కంటే తగ్గిందన్న సాకుతో చాలా మంది పింఛన్లను తొలగిస్తున్నారని ఆయన మండిపడ్డారు. దివ్యాంగుల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాల్సింది పోయి, వారి జీవితాలతో ఆటలాడుకుంటోందని ధ్వజమెత్తారు.

దేశ భవిష్యత్తు నిర్మాతలు విద్యార్థులే



సమావేశంలో మాట్లాడుతున్న యోగి వేమన యూనివర్సిటీ ప్రొఫెసర్ ఈశ్వరరెడ్డి

కడప ఎడ్యుకేషన్ : దేశ భవిష్యత్తు నిర్మాతలు విద్యార్థులే అని, ఉన్నత లక్ష్యాలతో చదివి దేశ అభివృద్ధిలో ప్రధాన భూమిక పోషించాలని యోగి వేమన యూనివర్సిటీ ప్రొఫెసర్ ఈశ్వరరెడ్డి, ప్రయివేట్ పాఠశాలల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల జోగిరామిరెడ్డి అన్నారు. శనివారం కడపలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్లీనరీ సమావేశాలు జరిగాయి. ఈ సమావేశంలో 'ప్రస్తుత సమాజం – విద్యార్థుల పాత్ర' అనే అంశం పై సదస్సు జరిగింది. ఈ సమావేశానికి ఆర్ఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు డి.యం. ఓబులేసు అధ్యక్షత వహించగా వక్తలు మాట్లాడుతూ ప్రపంచం సాంకేతిక రంగంలో కొత్త విప్లవంలో దూసుకుపోతోందని, మన దేశం సాంకేతిక రంగంలో ముందుండాలంటే విద్యార్థులే కీలకం అని అన్నారు. విద్యార్థులు మీ లక్ష్యాలను ఉన్నతంగా పెట్టుకొని దేశ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డి.యం. ఓబులేసు ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్లీనరీ సందర్భంగా జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌యస్ యఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సాయి, శివ, నాయకులు అభిషేక్, అనిల్, మహేష్, శంకర్, గణేష్, వంశీ, మమత, ప్రణతి పాల్గొన్నారు.

ఆపరేషన్ థియేటర్ ప్రారంభం


మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆర్. మాధవీ రెడ్డి, రిమ్స్ అధికారులు

కడప అర్బన్ : కడపలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఆవరణంలోనే సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్ కాంప్లెక్స్‌ను శనివారం కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధునిక సదుపాయాలతో కూడిన ఈ మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్ కాంప్లెక్స్ ప్రారంభం కావడం వల్ల ప్రజలకు మరింత నాణ్యమైన వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో కడప ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.జమున, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కెఎస్ఎస్ వెంకటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి, డాక్టర్ లక్ష్మీనరసమ్మ, ఆర్ఎంఓ డాక్టర్ శ్రీనివాసులు, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్‌కుమార్ రెడ్డి, వివిధ విభాగాల హెచ్ఓడీలు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్. శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

రెగ్యులర్ స్థానాలు కేటాయించాలి


డీఈఓకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : కాంప్లెక్స్ ఉపాధ్యాయులకు రెగ్యులర్ స్థానాలను, బదిలీ పొందిన ఎస్జీటీలను వెంటనే రిలీవ్ చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు కోరారు. శనివారం డీఈఓ షేక్ షంషుద్దీన్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఎస్సీ నియామకాల కంటే ముందే కాంప్లెక్స్ ఉపాధ్యాయులకు రెగ్యులర్ స్థానాలను కేటాయించడంతోపాటు బదిలీ పొందిన ఎస్జీటీ పోస్టులను మాత్రమే డీఎస్సీకి చూపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సివి రమణ, ఏజాస్ అహ్మద్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కృష్ణారెడ్డి నాయకులు సుబ్బారావు, గోపీనాథ్, ప్రకాష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవు


ఎరువుల దుకాణాలను పరిశీలిస్తున్న వ్యవసాయ, పోలీస్ అధికారులు

కమలాపురం : ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవు అని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. శనివారం ఆయన పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను సీఐ ఎస్‌కే రోషన్, ఎస్ఐ విద్యాసాగర్, విజిలెన్స్ అధికారి సుధాకర్‌తో కలసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ రిజిష్టర్లు, బిల్లు బుక్స్ పరిశీలించారు. స్టాక్ రిజిష్టర్లకు, నిల్వకు సరిపోక పోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే ఎరువులను రైతులకు విక్రయించాలన్నారు. రైతులు సైతం బిల్లులు తప్పని సరిగా తీసుకోవాలన్నారు. కమలాపురం మండలంలో ఇప్పటి వరకు 291 టన్నులు యూరియా పంపిణీ చేశామన్నారు. ఇప్పటి వరకు ఎటువంటి కొరత రాలేదని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. డీలర్లు కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఏఓ సరస్వతి పాల్గొన్నారు.

ధర్నా జయప్రదం చేయండి

కడప ఎడ్యుకేషన్ : 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలంటూ విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద జరిగే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీ రాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు పిలుపునిచ్చారు. శనివారం కడప యూటీఎఫ్ భవన్‌లో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 25వ తేదీ విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద జరిగే ధర్నా కార్యక్రమానికి యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సివి రమణ, ఏజాస్ అహ్మద్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కృష్ణారెడ్డి నాయకులు సుబ్బారావు, గోపీనాథ్, ప్రకాష్ బాబు, వీరనారాయణ, కిరణ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

కడప ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయ బదిలీలలో ఇటీవల బదిలీ అయ్యి రిలీవర్ లేక పాత స్థానాల్లోనే పనిచేస్తున్న ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేసి బదిలీ అయిన కొత్త స్థానాలలో చేరే విధంగా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్టీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆవుల శ్రీనివాసులు, బి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. శనివారం కడప జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యదర్శుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సమావేశంలో రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ తుపాకుల మురళి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నంద్యాల రాజగోపాల్ రెడ్డి, జిల్లా గౌరవ సలహాదారులు క్రిస్టఫర్ జాన్, జిల్లా కార్యదర్శి ఆలమూరు ప్రసాద్, బాలకృష్ణ, వెంకటేష్, అబ్దుల్ సలాం, సలపాది శ్రీనివాసులు, నాగేంద్ర, సాగర్ రవిశంకర్ శ్రీరాములు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

కడప సెవెన్‌రోడ్స్ : కడప నగరం నాగరాజుపేటలో ఉన్న క్యూర్ ఆస్పత్రిలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రముఖ ఎముకలు, కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ కె.పార్థసారథి తెలిపారు. ఆదివారం ఉదయం 9.00 నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు శిబిరం ఉంటుందన్నారు. ఎముకలు, కీళ్ల నొప్పులతో బాధపడుతున్న వారికి ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఎముకలు విరిగిన వారు, కీళ్ల వాతం సమస్య ఉన్న వారు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రముఖ జనరల్ ఫిజిషియన్ డాక్టర్ చంద్రమౌళి విషజ్వరాలు, థైరాయిడ్, గ్యాస్ ట్రబుల్, తలనొప్పి, కామెర్లు తదితర సాధారణ వ్యాధులకు ఉచిత పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ శిబిరంలో ఉచితంగా బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహిస్తారని, ఎముకల లవణ సాంద్రత పరీక్ష కూడా చేస్తామన్నారు. ఇతర వివరాలకు 95531 02102 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

రవీంద్రనగర్‌లో చోరీ

కడప అర్బన్ : కడప నగరంలోని తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో మురాదియానగర్‌కు చెందిన మౌలా అనే వ్యక్తి నాలుగురోజుల క్రితం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో ఊరికి వెళ్లాడు. గస్తీ తిరుగుతున్న పోలీసులు అతని ఇంటి తాళం విడిపోయి వుండటం గమనించి ఎస్ఐ తులసీనాగప్రసాద్‌కు తెలియజేశారు. చుట్టుప్రక్కల వారి సమాచారంతో మౌలాను పిలిపించారు. అతను రాగానే 300 గ్రాముల వెండి సామాగ్రిని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బోద కొట్టం అగ్నికి ఆహుతి

చింతకొమ్మదిన్నె : మండలంలోని గోపాలాపురంలో పాలెం వెంకటమ్మకు చెందిన బోద కొట్టం శనివారం అగ్ని ప్రమాదం జరిగి పూర్తిగా కాలిపోయింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలు వ్యాపించకుండా ఆర్పి వేశారు. ఈ ప్రమాదంలో ఇంట్లోని దుస్తులు, బీరువాలు, సామగ్రి కాలిపోవడంతో సుమారు 3 లక్షల రూపాయలు పైగా నష్టం జరిగినట్లు సమాచారం.

గుర్తు తెలియని వాహనం ఢీకొని విద్యార్థి మృతి

కడప అర్బన్ : పాత కడప చెరువు సమీపంలో ప్రధాన రహదారిపై శనివారం తెల్లవారుజామున పాల కోసం ఎదురు చూస్తున్న వై. ప్రసూన్‌కుమార్ రెడ్డి (14) అనే 9వ తరగతి విద్యార్థిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే కాలువలోకి జారి పడి మృతి చెందాడు. మృతిచెందిన విద్యార్థి తండ్రి నాగిరెడ్డి ట్రాఫిక్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. దేవుని కడపకు చెందిన నాగిరెడ్డి కుమారుడు ప్రసూన్ కుమార్ రెడ్డి తన తండ్రికి సంబంధించిన బైక్‌ను తీసుకుని పాత కడప చెరువు వద్దకు పాల కోసం వచ్చాడు. కొంతసేపటికే గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అతడు పక్కనే వున్న గుంతలోకి జారిపోయిన కొంతసేపటికి చనిపోయాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ జావేద్ తెలియజేశారు.

భవనాల పరిశీలన

పెండ్లిమర్రి : మండల కేంద్రంకు సమీపంలో రూ.12 కోట్ల నిధులతో నిర్మించిన ఆదర్శ ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాలను శనివారం కడప ఆర్డీఓ జాన్‌ఇర్విన్ పరిశీలించారు. సెప్టెంబర్ 2 న ప్రారంభోత్సవ ఏర్పాట్లు చేస్తున్నారు.

కాలభైరవ ఆలయంలో పూజలు


కుష్మాండ దీప సేవారాధనలో భక్తులు

కడప సెవెన్‌రోడ్స్ : కడప నగర సమీపంలోని ఎంఎస్ కొట్టాల గ్రామంలో వెలసిన శ్రీ ఇష్టకామ్యార్థ కాలభైరవస్వామి దేవస్థానంలో శనివారం అమావాస్యను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి పంచామృతాభిషేకం, అష్టోత్తరం, కుష్మాండ దీప సేవారాధన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో నగరం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి కాలభైరవస్వామికి పూజలు నిర్వహించారు.

దుర్గమ్మ సన్నిధిలో ఎస్పీ దంపతులు


అమ్మవారిని దర్శించుకుంటున్న ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ దంపతులు

కడప సెవెన్‌రోడ్స్ : కడప నగరం బిల్టప్ వద్దగల శ్రీ విజయదుర్గమ్మను సతీసమేతంగా శనివారం జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న వారికి అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి దర్శనం చేయించి అమ్మవారి పట్టు వస్త్రాలు అందజేసి ఘనంగా సత్కరించారు. ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు, నిర్వాహకులు దుర్గా ప్రసాద్‌రావు వారికి ఆలయ చరిత్రను తెలియజేసి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

చైల్డ్ హెల్ప్‌లైన్ 1098పై అవగాహన


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం వివిధ విద్యా సంస్థల్లో చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 పైన అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత 1098పై రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కడపలోని ప్రభుత్వ ఉర్దూ పాఠశాల, అంగడివీధి పాఠశాల, జయనగర్ కాలనీ లోని జెడ్పీ హైస్కూలులో విద్యార్థినులకు బాలల న్యాయ చట్టం , పోక్సో చట్టం, చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098 తోపాటు పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలియజేశారు. అలాగే ఆయా సమస్యలను ఎలా ఎదుర్కోవాలన్న విషయంపై వివరించారు. ఈ కార్యక్రమాల్లో ఐసీడీఎస్ పీడీ రమాదేవి, కడప అర్బన్ సీడీపీఓ వాణి, ఏసీడీపీఓ శోభారాణి, లీగల్ కమ్ ప్రొబెషన్ ఆఫీసర్ సునీతరాజు, ప్రొటెక్షన్ ఆఫీసర్ ప్రతాప్, అంగన్వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

దళితుల ఐక్యతను దెబ్బతీయడానికి కుట్ర


మాట్లాడుతున్న మాల మహానాడు రాక్స్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ రత్నాకర్

కడప రూరల్ : ఎస్సీ వర్గీకరణ పేరుతో దళితుల ఐక్యతను దెబ్బతీయడానికి దేశ వ్యాప్తంగా కుట్ర జరుగుతోందని మాల మహానాడు రాక్స్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ రత్నాకర్ అన్నారు. శనివారం వైస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అంశం తెలుగు రాష్ట్రాలకే గాక దేశ వ్యాప్తంగా నడుస్తోందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీతో పాటు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు , రేవంత్‌రెడ్డి దళితుల ఐక్యతను దెబ్బతీయడానికి కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. ఎస్సీ వర్గాలకు న్యాయం జరగాలంటే 10 శాతం రిజర్వేషన్లు పెంచాలన్నారు. అలాగే ఇతర రంగాల్లో కూడా రిజర్వేషన్లను వర్తింప చేయాలని తెలిపారు. కార్యక్రమంలో కోడికూతల శరత్, నెల్లి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలం


సంబటూరు ప్రసాద్‌రెడ్డి

కడప అగ్రికల్చర్ : రాష్ట్రంలో రైతులకు యూరియాను సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి తక్షణ చర్యలు తీసుకుని రైతులకు సరిపడా ఎరువులను సరఫరా చేయాలని ఏపీ రాష్ట్ర హార్టికల్చర్ మాజీ చైర్మెన్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికీ కొన్ని జిల్లాలలో యూరియా కోసం పి ఎ సి యస్ ల వద్ద రైతులు క్యూ లైన్‌లలో గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందన్నారు. యూరియా నిల్వలపై వ్యవసాయశాఖ ప్రకటనలకు క్షేత్ర స్థాయి పరిస్థితులకు సంబంధం ఉండటం లేదన్నారు. అనేక చోట్ల రైతులు అధిక ధర చెల్లించి బ్లాక్ లో యూరియా కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోందన్నారు. యూరియా రైతులకు అందించటంపై వ్యవసాయ శాఖ, అధికార యంత్రాంగం తక్షణమే గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. లేకపోతే కౌలు రైతులు, సన్న, చిన్న కారు రైతులు చాలా ఇబ్బంది పడతారన్నారు. యూరియా వాడక పోతే దిగుబడులు తగ్గి రైతులు నష్ట పోతారన్నారు. ఇప్పటికైనా స్పందించి తక్షణం యూరియా సరఫరా చేసి రాష్ట్ర రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ఎరువులను అధిక ధరలకు అమ్మితే చర్యలు


ఎరువుల షాపులో రికార్డులను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

కడప అగ్రికల్చర్: ఎరువులను అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవని విజిలెన్స్ అధికారులు హెచ్చరించారు. శనివారం కడప నగరంలోని పలు ఎరువుల దుకాణాలను విజిలెన్స్ ఆర్‌వీఈఓ శ్రీనివాసరావు, విజిలెన్స్ డీసీటీఓ గీతావాణి, పోలీస్‌శాఖ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణలు వ్యవసాయ ఏడీ సురేష్‌కుమార్ రెడ్డితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు షాపులకు సంబంధించిన లైసెన్సులతోపాటు ఎరువుల స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ అధిక ధరలకు ఎరువులను విక్రయించినట్లు రుజువైతే లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు. ఎవరైనా కృత్రిమ కొరతను సృష్టిస్తే చర్యలు తప్పవన్నారు.

యువకుడిపై రంపంతో దాడి


తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్న చంద్రకాంత్

కడప అర్బన్ : కడప నగరంలోని రవీంద్రనగర్‌లో తన ఇంటికి చంద్రకాంత్(17) అనే యువకుడిని మాయమాటలు చెప్పి, తీసుకుని వచ్చిన గణేష్ అనే వ్యక్తి రంపం తీసుకుని వచ్చి దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. ఈ సంఘటనలో పోలీసుల కథనం మేరకు.. గణేష్ ఉద్యానవన శాఖలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతడు 2015లో వివాహం చేసుకున్నాడు. భార్య కొన్ని రోజులకు మనస్పర్థలతో దూరంగా వెళ్లిపోయింది. తరువాత ఈశ్వరమ్మ అనే మహిళతో సహజీవనం నిర్వహించేవాడు. కొన్ని రోజుల నుంచి ఈశ్వరమ్మ తన కుమారుడు చంద్రకాంత్‌తో గణేష్‌కు దూరంగా వుంటోంది. ఈనెల 22వ తేదీన చంద్రకాంత్‌కు మాయమాటలు చెప్పి గణేష్ తన ఇంటిలో తనతో పాటు నిద్రించాలని తీసుకుని వచ్చాడు. ఈశ్వరమ్మ మీద కోపంతో చంద్రకాంత్‌పై రంపంతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. ప్రస్తుతం ఆసుపత్రిలో చంద్రకాంత్ చికిత్స పొందుతున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.